తూనీగలు

టీచర్ క్లాసురూమ్‌కువొస్తు తనముందు కుంటుతు నడిచే సూరి భుజం మీద చేయివేస్తూ.

"ఏంరా సూరి, కుంటుతున్నావేం" అని అడిగాడు.

సూరి తలపైకెత్తి "కాలికి ముల్లిరిగిందిసార్" అన్నాడు

"కంపనెందుకు తొక్కినవుర?"

సూరి మాట్లాడలేదు, టీచర్‌ముందు, సూరి వెనక క్లాసులోకి వెళ్లి కూర్చున్నాడు.

"సూరి కంపలో అడుగెందుకేశావో చెప్పనే లేదు." టీచర్

సూరి మౌనంగ నిలుచున్నాడు.

"నేను చెపుతాను సార్" అన్నాడు పక్క విద్యార్థి శివుడు.

సూరి శివునివైపు కోపంగ చూశాడు.

"చెప్పర, చెప్పు, నీవు చెప్పకపోయిన శివచెపుతాడట."

సూరి నోరు విప్పలేదు.

"చెప్పర శివ"

"నిన్న ఆటల పీరియడ్‌లో తూనీగలు పట్టకపోయి కంపలో అడుగేసిండు, స్లిప్పర్‌లోనుండి ముల్లు దిగబడింది సార్" అన్నాడు శివుడు.

అట్లనా అన్నట్టు చూశాడు టీచర్.

"తూనీగల పట్టద్దుర అంటె పడతడు సార్".

"హు" అంటు తలాడించాడు టీచర్.

"రోజు ఎన్నో తూనీగలను పట్టి రెక్కలు, తోకలు విరిచేస్తాడు సార్"

"చ్చొ, చ్చొ" అంటు ఓ మాదిరిగ సూరివైపు చూశాడు.

సూరి తలవంచుకుని నిబ్బరంగ చూస్తు నిలుచున్నాడు.

"ఏం రా సూరి, ఎందుకట్ల చేస్తావు" టీచర్ అడిగాడు.

క్లాసులో విద్యార్థులంత సూరినే చూస్తు వున్నారు.

"చెప్పర నీ ఉద్దేశ్యం ఏమిటి" టీచర్.

"మరి, మరి" సూరి ఏదో చెప్పబోయి ఆగాడు.

"హ, మరి" టీచర్

"నేనొక్కన్నే కాదు సార్. అందరు తూనీగలను పట్టుకుంటారు" సూరి గోళ్లు గిల్లుకుంటు చిన్నగ చెప్పాడు.

"మేం పట్టినా వాటి రెక్కలు, తోకలు ఇరువం తెలుసా" అన్నాడు శివ సూరివైపు, టీచర్‌వైపు చూపులను మార్చి మార్చి చూస్తు.

"సూరి, వీటినే కాదు సార్, సీతాకోక చిలుకలను పట్టుకుంటడు" అంటు అదనపు ఆరోపణ చేశాడు మరో విద్యార్థి కిషన్.

సూరి కిషన్‌వైపు గూడ కోపంగ చూశాడు.

"వున్న మాట అన్న, ఆయన జేబు చూస్తె తెలుస్తది సార్"

అన్నాడు కిషన్.

"ఏది, యిటు రా సూరి" అని పిలిచాడు టీచర్.

సూరి మౌనంగ టీచర్ దగ్గర్కి నడిచి వచ్చి నిలుచున్నాడు.

"ఏది నీ జేబులో ఏమున్నది తీయ్" అన్నాడు టీచర్.

షర్ట్ జేబులో వున్నవి ఒక్కొక్కటే బయటికి తీసాడు. చిన్న పెన్సిల్ ముక్క, రబ్బర్, నాలుగు చింతగింజలు.

"ఆ జేబిలోకాదు సార్, నిక్కర్ జేబిలో" అన్నాడు కిషన్.

సూరి కిషన్‌ను కొట్టేటట్టు, నోట్లో నోట్లో ఏదో అంటు నిలుచున్నాడు.

"తీయర, తీయవేంరా" అంటు టీచర్ వంగి సూరి జేబిలోని అగ్గిపెట్టెను తీస్తాడు. దానెమ్మటె ఓ చిన్న నెమిలి ఈక బయటపడింది.

"నీకు అగ్గిపెట్టె ఎందుకుర" అంటు పెట్టెను తెరిచాడు. అందులో ఓ అందమైన సీతాకోకచిలుక వుంది.

"వొరె, ఎందుకుర దీనిని ఇందులో బంధించావు. ఇంక నయం చావలేదు" అంటు దానిని అరచేతిలో వుంచి, కిటికిదగ్గర్కి తీసుకెళ్లాడు. అది బయటికి లేచిపోయింది.

సూరి తన చేతలు బయటపడ్డందుకు బాధగ, భయంగ నిలుచున్నాడు.

"వెళ్లి కూర్చోఫో" టీచర్ అన్నాడు.

సూరి తన సీటు దగ్గర్కి వెళ్లి కూర్చున్నాడు.

"పిల్లలూ! మీరంత తూనీగలను, సీతాకోక చిలుకలను పట్టగూడదు. అవి చాల అందంగ వుంటాయి కనుక వాటి వెంట మీరు పడతారు అవునా ?" టీచర్.

అవును అన్నట్టు తలలాడించారు.

"అందమైన వాటిని చూసి ఆనందించాలి. అంతె ముట్టకూడదు. తోటలో రంగు రంగుల పూలు అందంగానే వుంటాయి. వాటి అన్నిటిని మనం తెంపుతామా? అవి రాలినంక ఏరుకోవటం వేరు.

పోతే కందిరీగలు, తేనేటీగల జోలికి వెడతారా ? వెళ్లరు. ఎందుచేత అవి మిమ్ములను కుడతై కాబట్టి.

పిల్లలు ! కుట్టినా, కుట్టకపోయినా వాటి జోలికి మీరు వెళ్లవద్దు. వాటిని అసలె పట్టవద్దు. చంపవద్దు. అవి నోరులేని అమాయక ప్రాణులు. వాటిని హింసించకూడదు. ఇకనుండి వాటి జోలికి వెళ్లకండి. ఏ ప్రాణి మరొక ప్రాణిని హింసించరాదు. ముఖ్యంగ మంచిచెడు తెలిసిన మనం హింసచేయగూడదు అంటు అటెండెన్స్ రిజిష్టర్ తెరిచాడు.